క్లుప్తంగా

ఆర్పీల సమస్యలు పరిష్కరించాలి



ప్రభుత్వ విప్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆర్పీలు

ధర్మపురి: తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సోమవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ఆర్పీలు విజ్ఞప్తి చేశారు. మండలంలో పని చేస్తున్న మండల రిసోర్స్ పర్సన్లు (ఆర్పీలు) గత కొన్నేళ్లుగా ప్రభుత్వ కార్యక్రమాల్లో సేవలందిస్తున్నారు. తక్కువ వేతనాలతో ఎక్కువ పని భారం మోస్తున్న ఆర్పీలకు నెల వారి జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వం స్పందించి ఆర్పీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్పీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య



విద్యార్థులకు ప్యాడ్లు అందిస్తున్న నోడల్ అధికారి

కోరుట్ల: ప్రభుత్వ కళాశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందుతుందని జిల్లా ఇంటర్‌మీడియట్ నోడల్ అధికారి నారాయణ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, నోట్ బుక్కులు అందజేస్తున్నామని, అర్హులైన విద్యార్థులకు ఉపకారవేతనాలు ఇస్తున్నామన్నారు. ప్రభుత్వ కళాశాలల్లోని విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు పొందుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జిందం రాజేశ్, అధ్యాపకులు, హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలతో సీజ్ తొలగింపు



సీజ్ తొలగిస్తున్న కమిషనర్

జగిత్యాల: జగిత్యాలలోని మున్సిపాలిటీకి చెందిన టౌన్‌హాల్‌ను గతంలో మున్సిపాలిటీ టెండర్‌తో లీజుకు ఇచ్చింది. అందులో కొన్ని నియమ నిబంధనలను ఏర్పాటు చేసింది. వాటికి విరుద్ధంగా నిర్వహిస్తున్నారని ఆదివారం రెండు హోటళ్లను మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. టౌన్‌హాల్ నిర్వాహకులు హైకోర్టుకు వెళ్లడంతో హైకోర్టు సీజ్ వెంటనే తొలగించాలని మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో సోమవారం మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో సీజ్‌ను తొలగించారు. కార్యక్రమంలో మెప్మా ఏవో శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

అసైన్డ్ భూములు కాపాడాలని వినతి



వినతి పత్రం అందిస్తున్న హమీద్

కోరుట్ల: పట్టణంలోని అసైన్డ్ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని అధికారులు స్పందించి సరైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హమీద్ సోమవారం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కొంత మంది అసైన్డ్ భూములు కబ్జా చేసి రానున్న కాలంలో ప్రజావసరాల కోసం ఏలాంటి ప్రభుత్వ భూములు అందుబాటులో లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అసైన్డ్ భూములను సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం

మెట్‌పల్లి: మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. మెట్‌పల్లి పట్టణంలోని పాత బస్టాండ్‌లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు.ఈ సందర్భంగా కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. సీఎం ఇష్టారీతినా వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి
- పలు అభివృద్ధి పనులు ప్రారంభం



ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఆర్పీలు

జగిత్యాల:మహిళా సంక్షేమానికి కృషి చేస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలో రిసోర్స్‌పర్సన్లతో సమావేశమయ్యారు. గత ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలు కొనసాగిస్తూనే.. కొత్త పథకాలను ప్రజలకు అందిస్తామన్నారు. రిసోర్స్ పర్సన్లకు పెండింగ్ వేతనాలు విడుదల చేస్తామని, ఆర్పీలు, వీఏవోలకు ప్రతినెలా రూ.10వేల వేతనం అందేలా చూస్తామన్నారు. ఆర్పీల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సునీత, మున్సిపల్ మాజీ చైర్మన్లు గిరి నాగభూషణం, జిల్లా కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు విజయలక్ష్మి, కౌన్సిలర్లు అనిత పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు

పట్టణంలోని ఉప్పరిపేటలో సీసీరోడ్డుకు రూ.5లక్షలు, హనుమాన్ ఆలయానికి రూ.5లక్షలు, ఉప్పరిపేట నుంచి దగ్గులమ్మ గుడి వరకు మెటల్ రోడ్ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్సీ అన్నారు.

జగిత్యాల అర్బన్ మండలం ధరూర్‌లో టైం పాస్ టీ బ్రాంచ్‌ను ప్రారంభించారు.

ఆలయాభివృద్ధికి కృషి

రాయికల్: మండలంలోని అయోధ్య రామాలయంలో వసతులు కల్పిస్తానని జీవన్‌రెడ్డి అన్నారు. సీసీరోడ్డుకు రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. శ్రీరామ నవమిలోపు పనులుపూర్తి చేయాలని ఆదేశించారు. జగదీశ్వర్‌రెడ్డి, రానవేని రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు రవీందర్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

- ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



విద్యార్థులకు డిక్షనరీలు అందిస్తున్న ఎమ్మెల్యే

కోరుట్ల రూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని క్రమ శిక్షణతో చదువుకోవాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని యెఖీన్‌పూర్ ఉన్నత పాఠశాలలో 110 మంది విద్యార్థులకు ఇంగ్లిష్ డిక్షనరీలు, ఆటోమెటిక్ బెల్ రింగింగ్ సిస్టమ్‌ను పంపిణీ చేశారు. ఈ డిక్షనరీలు, రింగింగ్ సిస్టమ్‌ను పట్టణానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మార్గం దిలీప్ తన సొంత ఖర్చులతో సమకూర్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, పుస్తకాలు, ఉపకారవేతనాలు అందుతున్నాయన్నారు. ఇష్టపడి చదువుకొని ఉన్న శిఖరాలకు చేరుకోవాలని , సమాజసేవకు ఉపయోగపడాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మార్గం రాజేంద్రప్రసాద్, మాజీ వైస్ ఎంపీపీ కాశిరెడ్డి మోహన్ రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు అన్నం అనిల్, దారిశెట్టి రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తులకు ఉత్తమ సేవలు అందించాలి

కోరుట్ల: భక్తులకు ఉత్తమ సేవలు అందించాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. కోరుట్ల మహదేవస్వామి ఆలయ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానన్నారు. కార్యక్రమంలో పట్టణ బీఆర్ఎస్ అన్నం అనిల్, ఫయీం, అన్వర్, ఆడెపు శేఖర్, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి



వాహనాలకు స్టిక్కర్లు అంటిస్తున్న పోలీసులు

పెగడపల్లి:మాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పెగడపల్లి ఎస్సై సతీశ్ అన్నారు. ట్రాఫిక్, రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా స్కూల్ బస్సులు, టిప్పర్లు, ఆటోలను తనిఖీలు చేసి రాత్రిపూట ప్రమాదాలు నివారించేందుకు వాహనాలకు ఎరుపు రేడియం స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనం నడిపేటప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడకూడదని, మద్య సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని సూచించారు. ట్రాఫిక్, రోడ్డు భద్రతపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎస్సై సత్తయ్య, హెచ్‌సీ రవీందర్‌రెడ్డి, పీసీ ఉదయ్ పాల్గొన్నారు.

వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

మల్యాల: రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్సై తీగల అశోక్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారిపై వెళ్తున్న ట్రాక్టర్లు, భారీ వాహనాలకు రేడియం స్టిక్కర్లు అంటించి, అవగాహన కల్పించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగస్వాములు కావాలని ఎస్సై సూచించారు.

విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

బుగ్గారం: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని ప్రముఖ సామాజిక వేత్త డా.ఎల్లాల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. విద్యార్థులు శారీరకంగా,మానసికంగా ఎదగడానికి అవసరమైన సలహాలు,సూచనలు అందించారు. మంచి అలవాట్లతోనే మంచి క్రమశిక్షణ అలవడుతుందని అన్నారు. ఆరోగ్యపరంగా విద్యార్థులలో తలెత్తే వివిధ రకాల సమస్యలను గురించి తెలుపుతూ వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి అవగాహన కల్పించారు.

కిక్‌బాక్సర్‌కు ఆర్థికసాయం

పాఠశాలకు చెందిన నగునూరి హరీశ్ ఇటీవల రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కాగా, ఆ విద్యార్థికి రూ.10 వేల నగదు ప్రోత్సాహకాన్ని శ్రీనివాస్‌రెడ్డి అందించారు.ఉపాధ్యాయులు కూడా రూ. 5 వేలు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మోహన్‌రెడ్డి, నాయకులు చుక్క గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలొస్తే చర్యలే..

- 15 రోజుల్లో ఇద్దరు పోలీసులపై చర్యలు

జగిత్యాలక్రైం: జిల్లా పోలీసులపై ఆరోపణలు వస్తే వెంటనే చర్యలు తీసుకుంటున్నారు ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్. 15రోజుల క్రితం కొడిమ్యాల ఎస్సైపై ఆరోపణలు రాగా ఆయనను ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు. తాజాగా రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో కోర్టు విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ మహేందర్‌పై ఓ బాధితుడు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టిన ఎస్పీ వెంటనే అతడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 15రోజుల్లోనే ఇద్దరిపై చర్యలు తీసుకోవడంతో పోలీసుశాఖలో భయాందోళన వ్యక్తమవుతోంది.

నియామకం

ఎంఎస్పీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లక్ష్మణ్



లక్ష్మణ్

కోరుట్ల: జగిత్యాల జిల్లా ఎంఎస్పీ, ఎమ్మార్పీస్, అనుబంధ సంఘాల సమావేశం సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహాజన సోషలిస్టు పార్టీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చెట్టుపెల్లి లక్ష్మణ్ మాదిగ, జిల్లా అధ్యక్షుడిగా దూమాల గంగారాం మాదిగ, అధికార ప్రతినిధిగా జెజ్జంకి సతీష్ మాదిగ, కాశవత్తుల లక్ష్మీరాజం మాదిగ, జిల్లా ప్రదాన కార్యదర్శిగా అరికిల్ల సతీశ్ మాదిగ, ఉపాధ్యక్షులుగా బోనగిరి కిషన్, ముల్కల శ్రీనివాస్, దయ్యాల మనుమంతును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి గంధమల్ల నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

నామాపూర్ రజక సంఘం ఎన్నిక..

పెగడపల్లి:మండలంలోని నామాపూర్ రజక సంఘం కార్యవర్గంను సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాగళ్ల కుమార్, గౌరవ అధ్యక్షుడిగా రాగళ్ల గంగయ్య, ఉపాధ్యక్షుడిగా లింగంపల్లి స్వామి, ప్రధాన కార్యదర్శిగా రాగళ్ల శ్రీనివాస్, కోశాధికారిగా రాగళ్ల శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శిగా శ్రీకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాగళ్ల కుమారస్వామి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా లింగంపల్లి ఆదర్శ్, రైటర్‌గా లింగంపల్లి అజయ్‌కుమార్, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా చతాళ్ల రాజశేఖర్ ఎన్నికయ్యారు.

కాంగ్రెస్ బీసీసెల్ జిల్లా అధికార ప్రతినిధిగా తిరుపతి

కోరుట్ల: కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధిగా పొన్నం తిరుపతి నియమితులయ్యారు. ఈ మేరకు పట్టణంలోని జువ్వాడి భవన్‌లో బీసీ సెల్ గడ్డం వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కోరుట్ల ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు సోమవారం నియామక పత్రం అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు, పట్టణ. మండల అధ్యక్షులు తిరుమల గంగాధర్ గౌడ్, కొంతం రాజం, నాయకులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకుల ఉపాధ్యాయుల కార్యవర్గం..

జగిత్యాల: ఉమ్మడి జిల్లా మైనార్టీ గురుకుల పాఠశాల ఉపాధ్యాయుల సంఘం ఎన్నికలు కరీంనగర్‌లోని టీఎన్జీవో భవన్‌లో యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జరిగాయి. జగిత్యాల జిల్లా నుంచి ప్రధాన కార్యదర్శిగా దగ్గు రాకేశ్, కోశాధికారిగా రాజు, కార్యదర్శులుగా జ్యోతి, సంయుక్త, రవీందర్ ఎన్నికయ్యారు. వీరి ఎన్నిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

జాతీయ కబడ్డీ పురస్కారానికి ఎంపిక

గొల్లపల్లి: మండలంలోని శంకర్‌రావుపేట గ్రామానికి చెందిన సుద్దాల స్వరూప జాతీయ కబడ్డీ పురస్కారానికి ఎంపికయ్యారు. యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ తెలంగాణ స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాల సందర్భంగా జాతీయ కబడ్డీ క్రీడా రంగంలో ఉత్తమ క్రీడాకారిణిగా ఆమె సేవలను గుర్తించి తెలుగు వెలుగు స్ఫూర్తి యువ క్రీడారత్న జాతీయ అవార్డు ఎంపిక చేశారు. ఈ మేరకు ఆదివారం హన్మకొండలోని టీఎన్జీవో భవన్‌లో అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పాఠశాల స్థలంలో జీపీ భవనం నిర్మించొద్దు

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్ తండాలో పాఠశాల స్థలంలో గ్రామపంచాయతీ భవనం నిర్మించవద్దని సోమవారం ప్రజావాణిలో విద్యాకమిటీ చైర్మన్ తహసీల్దార్ ప్రసాద్‌కు విన్నవించారు. కార్యక్రమంలో ఎంపీవో కృపాకర్ ఏపీఎం శంకర్, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రగీతంగా 'జయజయహే తెలంగాణ' హర్షణీయం

జగిత్యాల:రాష్ట్రగీతంగా జయజయహే తెలంగాణ గీతాన్ని మార్చడం హర్షణీయమని కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు విజయలక్ష్మీ అన్నారు. ఇందిరాభవన్‌లో మాట్లాడారు. ఇప్పటివరకు టీఎస్‌గా ఉన్న నంబర్ ప్లేట్లను టీజీగా మార్చడం, గ్రూప్స్ పరీక్షల నిర్వహణ, షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ వంటి నిర్ణయాలు అభినందనీయమన్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, కౌన్సిలర్ దుర్గయ్య, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పశువైద్య శిబిరాలు

మేడిపల్లి: మండలంలోని పోరుమల్ల, కట్లకుంట్ల, వల్లంపల్లి గ్రామాల్లో పశు వైద్య కళాశాల విద్యార్థులు సోమవారం పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరంలో పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు, గర్భకోశ వ్యాధులకు సంబంధించిన చికిత్సలను, ఇతర శస్త్ర చికిత్సలను నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. కళాశాల అసోసియేట్ డీన్ ఆచార్య తక్కల్లపల్లి మాధవ రావు మాట్లాడుతూ ఆవుల్లో పిండ మార్పిడి ద్వారా మేలు జాతి దూడల ఉత్పత్తి, కృత్రిమ గర్భధారణ వంటి అంశాలను వివరించారు. కార్యక్రమాల్లో మండల పశు వైద్యాధికారులు డాక్టర్ తిరుపతి గౌడ్, డా. వెన్నెల, పశు సంవర్ధక శాఖ డాక్టర్లు, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల రజతోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కోరుట్ల: పట్టణంలోని గౌతమ్ హైస్కూల్ రజతోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యాసంస్థల వ్యవస్థాపకుడు ఎంఏ.గఫార్ మాట్లాడుతూ విద్యా సంస్థను మరింత అభివృద్ధి చేసి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ కిరణ్, కరస్పాండెంట్ గఫార్, ప్రిన్సిపాల్ గోపి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముస్సిపల్ అవినీతిపై చర్యలు తీసుకోవాలి



మున్సిపల్ ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

కోరుట్ల: పదేళ్లుగా మున్సిపల్ కార్మికులను మాజీ ఎమ్మెల్యే సొంతానికి వాడుకోవడం సరికాదని, అవినీతిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కోరుట్ల మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనకు దిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్ష, ఉపాధ్యక్షులు తిరుమల గంగాధర్, నయీం మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులను ఇళ్లల్లో పనికి వాడుకోవడంతో సిబ్బంది తక్కువగా ఉండి స్థానికంగా పారిశుద్ధ్య సమస్య తలెత్తి ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్లు ఈ విషయంలో స్పందించి వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంబేరి నాగభూషణం శీలం వేణు, రియాజ్, పేట భాస్కర్ పాల్గొన్నారు.

మున్సిపల్ ఎదుట కాంగ్రెస్ ఆందోళన

మెట్‌పల్లి:కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు,ఎమ్మెల్యే సంజయ్ ఇంట్లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులను తిరిగి కార్యాలయంలో విధుల్లోకి తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సోమవారం మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే,ఎమ్మెల్యే ఇంట్లో పనిచేస్తూ మున్సిపల్ నుంచి తీసుకున్న కార్మికుల జీతాలను వారిద్దరి నుండి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీమల్లన్నస్వామి జాతర



ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

మల్లాపూర్: మండలంలోని ఒబులాపూర్‌లో పురగిరి క్షత్రియ పేరక సంఘం ఆధ్వర్యంలో శ్రీ గుట్టమీది మల్లన్న స్వామి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రూ.15 లక్షల నిధులతో నిర్మించిన శ్రీ గుట్టమీది మల్లన్న స్వామి ఆలయంలో జాతర ఉత్సవాలు కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. సోమవారం ఆలయంలో పూజ కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఉత్సవాలకు హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, ఉత్సవ నిర్వాహకులు ఎమ్మెల్యేకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కాటిపెల్లి సరోజన, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గౌరు నాగేష్, ఎంపీటీసీ ఏనుగు రాంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సోమేశ్వర కొండపై భక్తుల సందడి

మండల కేంద్రంలోని సోమేశ్వర కొండపై సోమవారం భక్తుల సందడి నెలకొంది. శ్రీ కనక సోమేశ్వర స్వామిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల గ్రామాలు, మండలాల నుంచి భక్తులు తరలివచ్చి కోనేటిలో స్నానమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. మల్లాపూర్‌కి చెందిన సోమగిరి ఇండేన్‌గ్యాస్ నిరాహకుడు తోట రాజారాం–సరస్వతి దంపతుల సహకారంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సంగ గంగరాజం, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



కరాటే పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

జగిత్యాల: కరీంనగర్ జిల్లాలో నిర్వహించిన ఇండో నేపాల్ చాంపియన్‌షిప్‌లో జగిత్యాలకు చెందిన పవన్ కరాటే అకాడమీకి చెందిన క్రీడాకారులు గ్రాండ్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. ఇందులో బ్లాక్‌బెల్టు విభాగంలో జగన్, స్పారింగ్ విభాగంలో సంపత్ గోల్డ్‌మెడల్ సాధించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు వీరిని అభినందించారు.

జాతీయ స్థాయిలో కరాటే విద్యార్థుల ప్రతిభ

కోరుట్ల: పట్టణానికి చెందిన ఒకినోవా స్కూల్ ఆఫ్ కరాటే స్పోర్ట్స్ అసోసియేషన్ విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటారు. ఈ నెల 3వ తేదీన కరీంనగర్‌లో జరిగిన ఇండో–నేపాల్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ 2024 జాతీయ కరాటే పోటీల్లో కోరుట్ల ఒకినోవా కరాటే విద్యార్థులు 13 పథకాలు సాధించారు. 2 బంగారు, 5 వెండి, 6 కాస్య పథకాలు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కోచ్ అల్లె రమేశ్, తెలంగాణ చీఫ్ వసంత్, తదితరులు అభినందించారు.

మెట్‌పల్లి: అంతర్జాతీయ స్థాయి కరాటే చాంఫియన్ షిప్–2024 పోటీల్లో మెట్‌పల్లి పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులు సత్తాచాటారు.ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ఈనెల 2,3,4 వ తేదీల్లో జరిగిన పోటీల్లో పట్టణానికి చెందిన జి.కౌశిక్‌కు కటాస్ స్పారింగ్ అండర్–14 విభాగంలో కాంస్య పతకం దక్కగా, అండర్–10 విభాగంలో ఏ.లినిషకు వెండి పథకం దక్కింది. పథకాలు సాధించిన విద్యార్థులకు డబ్ల్యూకెఎఫ్ జడ్జి కనకరాజు చేతుల మీదుగా పతకాలు,ప్రశంసాపత్రాలు అందజేశారని జగిత్యాల జిల్లా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ అవినాష్, ఇన్‌స్ట్రక్టర్ శివాని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలువురు అభినందించారు.

సంక్షిప్త వార్తలు

ఆయిల్‌పామ్ తోటల పరిశీలన

జగిత్యాలరూరల్: రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని ఏఈవో సంధ్య అన్నారు. సోమవారం జగిత్యాల రూరల్ మండలం సోమన్‌పల్లిలో గొంటి మొగిలి అనే రైతు సాగు చేసిన ఆయిల్ పాం తోటను పరిశీలించారు. ఆయిల్ పాం రైతులు యజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు కొన్న జగ్గారెడ్డి, నీలం గంగయ్య, లింగయ్య పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేద్దాం

మల్లాపూర్: గ్రామాల అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దామని డిప్యూటీ తహసీల్దార్ శ్రావణి అన్నారు. మండలంలోని పాతదాంరాజుపల్లిలో ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మైదాసు శ్రీనివాస్, గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూషణరావుపేటలో సన్మానం

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో మాజీ పాలకవర్గాన్ని గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కూన సులోచన, ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎం.డీ గఫూర్, నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడాకారిణికి ఎస్సై అభినందన

రాయికల్: పట్టణానికి చెందిన వేముల శాన్వి అండర్ – 14 ఇటీవల వైఎస్సార్ జిల్లా కడపలో నిర్వహించిన జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చింది. ఈ సందర్భంగా శాన్విని సోమవారం ఎస్సై అజయ్‌గౌడ్ సన్మానించారు. కార్యక్రమంలో నాయిని మహేశ్, రాజేశ్ పాల్గొన్నారు.

పోపా అధ్యక్షుడికి సత్కారం

జగిత్యాల: పద్మశాలీ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (పోపా) జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కొక్కుల రాజేశ్‌ను భక్తమార్కండేయ సత్సంగ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, ఆర్థిక కార్యదర్శి శంకర్, ధనుంజయ్, శివప్రసాద్ పాల్గొన్నారు.

అదనపు తరగతి గది ప్రారంభం

కథలాపూర్: మండలంలోని బొమ్మెన ప్రాథమిక పాఠశాలలో దాతల సహకారంతో నిర్మించిన అదనపు తరగతి గదిని సోమవారం హెచ్‌ఎం అంబటి రవి ప్రారంభించారు. గ్రామంలోని పలువురు దాతలు అందించిన రూ. లక్ష తో రేకుల షెడ్డుతో తరగతి గది నిర్మించినట్లు హెచ్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పిడుగు తిరుపతిరెడ్డి, చిందం సుధాకర్, పిడుగు మహేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ పురస్కారం అందుకున్న గంగుల శ్రీనివాస్‌యాదవ్

రాయికల్: మండలంలోని మైతాపూర్ గ్రామానికి చెందిన గంగుల శ్రీనివాస్‌యాదవ్ హన్మకొండలోని యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ పురస్కారాల మహోత్సవాల్లో సామాజిక సేవా రంగంలో శ్రీనివాస్‌కు జాతీయ పురస్కారం అందజేసినట్లు నిర్వాహకులు వేములవాడ రాధిక, యాదగిరిగౌడ్, రాజ్‌కుమార్ తెలిపారు.

మల్యాలలో నలుగురికి నర్సింగ్ ఉద్యోగాలు

మల్యాల: మండలానికి చెందిన నలుగురు నర్సింగ్ ఉద్యోగాలు సాధించారు. కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు చేస్తున్న పర్వీన్, ఇమ్రాన్ ఉద్యోగం సాధించారు. పర్వీన్ 2016 నుంచి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎన్‌సీడీ స్టాఫ్‌నర్సులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఇమ్రాన్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఐసీయూ వార్డులో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు. అలాగే మండలకేంద్రానికి చెందిన కొల్లూరి ప్రేమలత, రామన్నపేట గ్రామానికి చెందిన పి.మధు కూడా ఉద్యోగాలు సాధించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ధర్మపురి: మండలంలోని కమలాపూర్‌లో సోమవారం ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పంచాయతీ ప్రత్యేకాధికారి సుమన్ వైద్య శిబిరం ప్రారంభించారు. వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రతిమ మెడికల్ వైద్యులు అనిల్, వరుణ్, మాధవి, అశోక్, రవీనా, రాజేందర్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

7 నుంచి కోరుట్లలో వైద్య శిబిరం

కోరుట్ల: పట్టణంలో ఈ నెల 7 నుంచి 12 వ తేదీ వరకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అక్యుప్రెషర్, మ్యాగ్నెటిక్ చికిత్స శిబిరం నిర్వహిస్తున్నామని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వనపర్తి చంద్రం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు రోజుల పాటు నిర్వహించే చికిత్స కోసం రూ. 100 ఫీజు మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పట్టణం, పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.